క్లుప్తంగా

ఔషధ పరిశ్రమల్లో కెమికల్స్ వినియోగంపై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

పరవాడ: ఔషధపరిశ్రమల్లో మిథనాల్, ఇథనాల్ వంటి కెమికల్ వినియోగం, రవాణాపై ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని విశాఖపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో ఎంఎస్ఆర్ఎం కార్యాలయంలో ఫార్మాసిటీ పరిశ్రమల సిబ్బందికి శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మిథనాల్, ఇథనాల్‌ను ఉపయోగించే సమయంలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవగాహన సదస్సుకు వివిధ ఫార్మా పరిశ్రమలకు చెందిన 90 మంది సిబ్బంది హాజరయ్యారు. సదస్సులో అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనర్ సీహెచ్‌వీ మహేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, ఎక్సైజ్ అధికారులు బి.ఈశ్వరరావు, అనకాపల్లి టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ కె.సురేష్, సబ్బవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్, ఎస్ఐ వీవీ రమణ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెందుర్తి: స్థానిక నాయకుడు వేగి శ్రీనివాసరావు, అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం పెందుర్తి కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. దంత వైద్య నిపుణురాలు డాక్టర్ శరగడం గ్రీష్మ అనూష నేతృత్వంలో 150 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. వైద్య బృందం ఎస్.సరిమిక, ఎస్.లక్ష్మీసంజన పాల్గొన్నారు.

ఆదర్శ్ మెగాజాబ్ మేళాలో 78 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులకు సూచనలిస్తున్న కరస్పాండెంట్ థియోఫిలాస్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన మేళాలో మొత్తం 128 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 78 మంది ఎంపికైనట్లు కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ తెలిపారు. అభ్యర్థులంతా తమ ఉపాధిమార్గంలో మరింతగా రాణించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఈ ఫ్లోరా, సిబ్బంది ఎ.శ్రీనివాసరావు, జి.రవిబాబు, డీటీ రమ్య, సీహెచ్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రహదారులపై రాకపోకలు సాగించడం ప్రమాదకరమని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. లంకెలపాలెం వంతెనపై నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఇలాంటి ప్రయాణాల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులను హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

వెంకన్నకు అభిషేకాలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ చేశారు. అనంతరం విశేష అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కలుషిత నీటితో కష్టాలు

నీరిచ్చే బోర్లున్నా.. దుస్తులు ఉతికేందుకు, వంట పాత్రలు శుభ్రం చేసేందుకు మినహా తాగేందుకు, వంటకు పనికి రావు. దాహం వేస్తే గుక్కెడు నీటి కోసం సమీప గ్రామాల్లోని ఆర్వో ప్లాంట్లను ఆశ్రయించాల్సిందే. కలుషిత నీటికి కారణమైన ఎన్టీపీసీ పట్టించుకోవట్లేదు. ఎన్నికల ముందు హామీలు గుప్పించిన కూటమి నేతలు పత్తాలేరు. ఇక తమ గోడు ఎవరికి వినిపించేందంటూ.. పరవాడ మండలంలోని కలపాక, మూలస్వయంభూవరం ప్రజలు తమ క'న్నీటి'వెతలపై వాపోతున్నారు.

- ఎన్టీపీసీ ఉప్పునీటి వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితం
- తాగునీటికి పక్కగ్రామాలపై ఆధారపడుతున్న కలపాక, మూలస్వయంభూవరం ప్రజలు
- కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలని ప్రజల మొర



బోరు నీటితో దుస్తులు ఉతుకుతున్న మహిళలు



కలపాకలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న కలపాక గ్రామ పంచాయతీ, శివారు గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలు తీరట్లేదు. పంచాయతీ, ఎన్టీపీసీ అధికారులు కనీస చర్యలూ చేపట్టకపోవడంతో ప్రజలు సమీపంలోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకుంటున్నారు. ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న మూలస్వయంభూవరం ప్రజల పరిస్థితి మరీ దారుణం. తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఎంతగా మొరపెట్టుకుంటున్నా.. ఎవరూ పట్టించుకోవట్లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్లే దిక్కు

గ్రామ సమీపం నుంచి ప్రవహిస్తున్న ఎన్టీపీసీ ఉప్పునీటి వ్యర్థ జలాలు భూమిలో ఇంకిపోయి భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. దీంతో బోర్లు, మంచినీటి బావుల నుంచి వచ్చే నీరు గొంతు తడిపే పరిస్థితి లేక కలపాక, మూలస్వయంభూవరం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కలపాకలో 2016లో ఎన్టీపీసీ సౌజన్యంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులతో మూలకు చేరింది. మంచినీటి ట్యాంకు ద్వారా సరఫరా అవుతున్న నీరూ బాగోక పోవడంతో సమీప గ్రామమైన వెన్నలపాలెంలోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకుంటున్నారు.

కుళాయిలున్నా.. నీరేదీ?



మూలస్వయంభూవరంలో ఏర్పాటు చేసిన మినీవాటర్ ట్యాంకు

జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినా.. నీటి సరఫరా మాత్రం జరగట్లేదు. మూలస్వయంభూవరంలో ఉన్న మినీ వాటర్ ట్యాంకు అక్కడి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చలేకపోతోంది. దీంతో సమీపంలోని బొబ్బిలి ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి గ్రామానికి పైప్‌లైన్ ద్వారా నీరందిస్తున్నారు. ఈ పైప్‌లైన్‌కు తరచూ రిపేర్లొస్తున్నాయి. ఆ సమయాల్లో తాగునీటికి కిలోమీటర్ల మేర పరుగులు తీయాల్సిందే.



పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ నుంచి నీరు బయటకు పోకుండా అడ్డుగా పెట్టిన కర్ర ముక్క

శుభ్రం చేసే నాథుడు లేడు!

మూలస్వయంభూవరంలోని మినీ వాటర్ ట్యాంకు నిచ్చెన మరమ్మతులకు గురైంది. దీంతో నాలుగు నెలల నుంచి ట్యాంకును శుభ్రం చేయడం గానీ, బ్లీచింగ్ పిచికారీ గానీ చేసిన పాపాన పోలేదు. దీనికి నీరందించే పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ పాడై నీరు వృథాగా పోతుండడంతో దానికి కర్ర ముక్కను అడ్డుపెట్టి నీటి వృథాను కాస్త తగ్గిస్తున్నామని గ్రామస్తులు చెప్తున్నారు. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరు నీరు బట్టలు ఉతుక్కోవడానికి తప్ప ఎందుకూ పనికిరాదని వాపోతున్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు



గ్రామంలో ఎక్కడ చూసినా కలుషిత నీరే. దప్పిక తీర్చుకునేందుకు గుక్కెడు మంచి నీళ్లు దొరకవు. ఈ నీటితో అన్నం, పప్పులు ఉడకవు. ఈ బాధలు భరించలేక గ్రామాన్ని వదిలిపెట్టి ఎప్పుడు పోదామా? అనిపిస్తుంది. ఎన్టీపీసీ దుమ్ము ధూళితో ఆరోగ్యాలు పాడవుతున్నాయి. ఇళ్లు గుల్లవుతున్నాయి. మగ పిల్లలకు పిల్లల్ని ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావట్లేదు. ఇంకా ఎన్నాళ్లీ కష్టాలు భరించాలో..!

– బొండా బుచ్చమ్మ, మూలస్వయంభూవరం

కుళాయిల ద్వారా నీరందించాలి



జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఏడాది నుంచీ వీటికి మరమ్మతులు చేస్తున్నారేతప్ప.. తాగునీటిని సరఫరా చేయట్లేదు. ఎక్కడికక్కడ గోతులు తవ్వి వదిలేస్తున్నారు. గోతులతో ప్రమాదాల బారినపడుతున్నాం. వాటర్ ప్లాంట్ ఏళ్ల తరబడి మరమ్మతులో ఉంది. తాగునీటికి కటకటలాడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బొండా నాగలక్ష్మి, కలపాక

ట్యాంకు శుభ్రం చేయట్లేదు



మా ఊర్లోని మినీ వాటర్ ట్యాంక్‌ను నాలుగు నెలలుగా శుభ్రం చేయట్లేదు. బ్లీచింగ్ పిచికారీ చేయలేదు. నీరందించే పైప్‌లైన్ వాల్వు రిపేర్లతో మూల్గుతోంది. చేసేది లేక కర్ర ముక్కను అడ్డం పెట్టి నీరు బయటకు పోకుండా కాపాడుకుంటున్నాం. ఎన్టీపీసీ పుణ్యామా అని పంటలు పోయాయి. తినడానికి తిండి గింజల్లేక అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పుడు తాగునీటికీ అదే దుస్థితి.

– మరిశ రమణ, మూలస్వయంభూవరం

అరకు ఎంపీ చొరవతో దివ్యాంగునికి వీల్‌చైర్



దివ్యాంగుడు శ్రీనివాసరావుకు వీల్‌చైర్ అందిస్తున్న జర్సింగి సూర్యనారాయణ

పెందుర్తి: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనుజారాణి చొరవతో ఓ దివ్యాంగునికి విశాఖపట్నం సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వీల్‌చైర్ సమకూర్చారు. జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురం సమీపంలోని గవరపాలెం కాలనీకి చెందిన బి.శ్రీనివాసరావుకు రెండుకాళ్లు వైకల్యం ఉంది. ఈ క్రమంలో తనకు వీల్‌చైర్ సమకూర్చాలని కోరుతూ అరకు ఎంపీ తనుజారాణికి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించి దివ్యాంగుడు శ్రీనివాసరావుకు వీల్‌చైర్ సమకూర్చాలని సిటిజన్ వెల్ఫేర్‌కు ఎంపీ సూచించారు. శుక్రవారం వేపగుంటలో జరిగిన కార్యక్రమంలో పెదబయలు మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ చేతుల మీదుగా శ్రీనివాసరావుకు వీల్‌చైర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎంపీకి శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హాకర్స్ జోన్ వచ్చేవరకు వ్యాపారాలు చేసుకోనివ్వాలి



వేపగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న తోపుడుబళ్ల వ్యాపారులు, ఏఐటీయూసీ నాయకులు

పెందుర్తి: జీవీఎంసీ ఉన్నతాధికారులు చెబుతున్నట్లు చిరువ్యాపారుల కోసం హాకర్స్ జోన్ ఏర్పాటు చేసేవరకు, వారిని ఇదివరకు ఉన్న స్థలాల్లోనే వ్యాపారాలు చేసుకోనివ్వాలని ఏఐటీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, వై.రాంబాబు డిమాండ్ చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిరువ్యాపారుల బడ్డీలు, తోపుడుబళ్లను కూలగొట్టడం దుర్మార్గమన్నారు. తోపుడు బళ్ల వ్యాపారులకు మద్దతుగా జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలో శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన విధ్వంసం వలన చిరువ్యాపారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా ముందు వారిని కూటమి ప్రభుత్వం చావుదెబ్బ కొట్టిందని ధ్వజమెత్తారు. చిరువ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, వారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ ర్యాలీలో వేపగుంట, నాయుడుతోట ప్రాంతాల చిరువ్యాపారుల సంఘం ప్రతినిధులు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కేసులు ఉపసంహరించుకుంటాం

సీతంపేట: ముదపాకలో జరిగిన ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం నచ్చక గతంలో కొంత మంది రైతులు కోర్టుకు వెళ్లడం వల్ల ఆ ప్రక్రియ ఆగిపోయిందని ముదపాక రైతులు సారిపల్లి భీమేశ్వరరావు, నీలాపు రమణ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో రైతులను తప్పుదారి పట్టించడం వల్ల కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని, కోర్టులో ఇప్పటి వరకు ఐదు కేసులు వేసి ఉన్నామని, తమకున్న బాధలో రెవెన్యూ అధికారుల పట్ల తప్పుగా మాట్లాడామని, ఇవన్నీ తెలియకుండా చేసినవని చెప్పారు. ఇపుడు ల్యాండ్ పూలింగ్‌పై పూర్తి అవగాహన వచ్చిందని, కోర్టులో ఉన్న కేసులను ఉపసంహరించుకుంటామని కలెక్టర్, జేసీ, ఆర్డీ వోలకు విన్నవించామన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



రావాడలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు

పరవాడ: మండలంలోనిరావాడ పంచాయతీ మోటూరువానిపాలెంలో దాలిబోయిన నాయుడు ఇంటి నుంచి రైతు సేవా కేంద్రం వరకు రూ.3 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను పరవాడ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసిన పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ కావలి రాజు, కావలి వాసు, మొల్లి వెంకటరావు, కేవీ అప్పలరాజు పాల్గొన్నారు.

ద్రోణంరాజు కిరణ్ మృతి తీరని లోటు



ద్రోణంరాజు కిరణ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్, భగవాన్ జయరామ్, శ్రీవాత్సవ్



ద్రోణంరాజు కిరణ్(ఫైల్)

పెందుర్తి: దివంగత మాజీ రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ మనవడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త ద్రోణంరాజు కిరణ్ ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఆ పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కిరణ్ మరణం పార్టీకి తీరని లోటన్నారు. గుండెపోటుతో మృతి చెందిన కిరణ్ భౌతికకాయానికి శుక్రవారం అదీప్‌రాజ్ ఘన నివాళులర్పించారు.

చినముషిడివాడలోని కిరణ్ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, పార్టీ నేతలు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P.No. 258 / 2019 In O.S. No180/2018

Between:
GIDUTHURI VASUDEVA RAO ....D HR.
And:
1.KONETI PRADEEP KUMAR
2.GODAGALA RAGHU .... JDR'S
To
J Dr. 2: GODAGALA RAGHU S/o Ramadas, Hindu, Aged 35 years, D.No. 49-35-21, NGGO's Colony, Akkayyapalem, Visakhapatnam- 16

SALE PROCLAMATION

Take notice that the above named DHR has instituted the above EP U/O XX1 Rule 54, 64 to 66 against the JDR-2 for a recovery of sum of Rs.11,50,743/- with interest and costs by auctioning the below mentioned scheduled property by way of public auction in the above court **on 13.09.2025 between at 10.30 A.M to 05.00PM** as per the terms and conditions of the Honoureable Court

SCHEDULE

JDr.2: GODAGALA RAGHU S/o Ramadas, Flat bearing No.F-2 built in 940 Sq. Ft. (including Car parking 80Sq..Ft), undivided Share of 41 Sq. Yds out of 534 Sq. yds. in Sri Sai Balaji Apartment, bearing House No.12-12-114, in Plot Nos.52 & 61, W-B : 12-12, in S Nos.77, 79, 96 & 95, at Srama Sakthi Nagar, China Mushidivada, Visakhapatnam District, SRO Pendurthi, within the limits of the Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam District is bounded by:
Boundaries of Sri Sai Balaji Residency Apartment House No.12-12-114:
EAST: 30Feet Road, SOUTH: Plot Nos. 53 & 60, WEST: 30Feet Road, NORTH : Plot Nos. 51 & 62.
Boundaries of FLAT No.F-2 in First Floor in Sri Sai Balaji Residency Apartment:
EAST : Corridor, SOUTH: Open Space, WEST:Flat No.F3, NORTH : Open Space

EP : Rs.11,50,743/-
DHR Value of the Property: Rs.16,00,000/-
Amin Value: Rs.20,00,000/-

ADAPA VENKATESWARA RAO, ADVOCATE,
D No. 44-45-35, Narendra Nagar, Visakhapatnam.
VISAKHAPATNAM-16
DT.26.09.2025

మహాలక్ష్మీ నమోస్తుతే..



ఎస్ఆర్ పురంలో మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ



సుజాతనగర్ అయ్యప్పదేవాలయంలో మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ



శ్రమశక్తినగర్‌లో మంగళగౌరిగా పంచముఖ గాయత్రీదేవి



పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో బాలాత్రిపురసుందరిగా అమ్మవారు



విజినిగిరిపాలెంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉమాదేవి



మహాలక్ష్మి అలంకరణలో దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల దేవాలయాల్లో ఐదో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మంగళగౌరిగా అమ్మవారు పూజలందుకున్నారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీఎత్తున కుంకుమ పూజలు చేశారు. సంతానలక్ష్మిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహాకామేశ్వరిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు.ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భారీ ఎత్తున కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెం ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదవరోజు శుక్రవారం ఉమాదేవి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపి, కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.



దేవీపురం యాగశాలలో మహాలక్ష్మి సహిత గురు అమృత జయంతి హోమంలో వేద పండితులు, భక్తులు

- 98వ వార్డు సింహపురికాలనీ ప్రధాన ఆర్చ్‌వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో స్థానిక ఆటోడ్రైవర్లు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల నుంచి భక్తులు, మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- సింహపురికాలనీలోని గాయత్రీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. అర్చకులు అమ్మవారికి విశేష హారతులు అందించారు.
- అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద గణేష్ యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి బోనాల ఊరేగింపు, నిప్పులగుండం తొక్కే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు శిరస్సుపై బోనాలు పెట్టుకుని అడవివరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా, గ్రామదేవతలు పైడితల్లి, బంగారమ్మ ఆలయాల వద్దకు బోనాలతో తరలివెళ్లారు. అక్కడి నుంచి దుర్గాదేవి మండపం వద్దకు వచ్చి నిప్పులగుండాన్ని తొక్కి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. గణేష్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

దేవీపురంలో..

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గురూజీ అమృతానంద సరస్వతి 91వ జయంతిని వేడుకగా జరిపారు. వారి ద్వారా ఉన్నత శిఖరాలను అందుకున్న స్థానిక, దేశ, విదేశాలకు చెందిన భక్తులు దేవీపురం తరలివచ్చి గురు భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా శ్రీగణపతి విద్యారణ్య సంపుటిత శ్రీమహాలక్ష్మి సహిత గురు అమృత జయంతి హోమం నిర్వహించారు. సాయంత్రం పాటలు, నృత్యాలు, భజనలు, కోలాటాలతో పల్లకీ సేవలో అమ్మవారి ఉత్సవ మూర్తులను, గురు పాదుకలను ఊరేగింపుగా ఆశ్రమానికి తెచ్చి, గురు పూజ చేశారు. అనంతరం గురుమాత అందరినీ ఆశీర్వదించి, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.